నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, మంగళవారం 24 డిసెంబర్ 2024 | PEDDAPALLI




చింతకుంట గ్రామాన్ని కరీంనగర్‌కార్పొరేషన్‌లో విలీనం చేయద్దంటూ చింతకుంట కెనాల్ వద్ద రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

## విలీనాన్ని నిలిపేయండి

చింతకుంట గ్రామస్థుల రాస్తారోకో

కొత్తపల్లి, డిసెంబర్ 23 : కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామాన్ని కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు, ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. చింతకుంట కెనాల్ వద్ద కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా, గ్రామసభ నిర్వహించకుండా ఏకపక్షంగా దొడ్డిదారిన చింతకుంట గ్రామాన్ని కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విలీనం వల్ల సుమారు వెయ్యి మంది ఉపాధిహామీ కార్మికులకు తిండి దొరకని పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. పన్నులు రెండింతలు పెరిగి బడుగు, బలహీనవర్గాలకు అర్థిక ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. గ్రామపంచాయతీగా ఉంటేనే చింతకుంటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు వచ్చి అభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి విలీన ప్రక్రియను వెంటనే నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ తర్వాత కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు రేణయ్య, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రేణిగుంట రాజు, రైతు సంఘం అధ్యక్షుడు శంకరయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సోమిరెడ్డి లచ్చిరెడ్డి, కరుణాకర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


## కిలేడీల ముఠా.. దోచేస్తది..

- బస్టాండ్లు, రద్దీ ప్రాంతాలే టార్గెట్
- అదును చూసి బంగారు ఆభరణాలు, నగదు దొంగతనం
- జగిత్యాలలో 37 తులాల నగలు చోరీ
- తాజాగా దొంగల ముఠా ఆటకట్టు

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 23 : ఆ నలుగురి మహిళలది ఓ ముఠా! బస్టాండ్, రద్దీ ప్రాంతాలనే టార్గెట్ చేస్తారు.. ఆ జనాల్లో కలిసిపోతారు.. అదును చూసి బంగారు ఆభరణాలు దోచేస్తారు.. ఇలా చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర మహిళల దొంగల ముఠా గుట్టును జగిత్యాల టౌన్ పోలీసులు రట్టు చేశారు. పది రోజుల క్రితం ఓ మహిళ బ్యాగులోంచి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన ముఠాలోని ఓ మహిళను తాజాగా అరెస్ట్ చేశారు. జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహిళ అరెస్టును చూపి డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. నాగపూర్ సిటీకి చెందిన నలుగురు మహిళలు రామేశ్వరి, హత్గాడే కాంత, హత్గాడే గుజాన, సంజన నాడే ముఠాగా ఏర్పడి బస్టాండ్, రద్దీగా ఉండే ప్రాంతాల్లో అదను చూసి చోరీలకు పాల్పడేవారు. మహిళల బ్యాగుల్లోంచి బంగారు నగదు, నగదు దోచుకెళ్లేవారు. వీరిపై పలు ప్రాంతాల్లో కేసులు కూడా ఉన్నాయి. కాగా, జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపెల్లికి చెందిన మిట్టపెల్లి రవీందర్‌రెడ్డి–జలజ దంపతులు తమ 37 తులాల బంగారు నగలను బ్యాంకు లాకర్‌లో పెట్టేందుకు ఈ నెల 16న జగిత్యాలకు వచ్చారు. అయితే ఆ బంగారం లాకర్‌లో పెట్టడం కుదరలేదు. దీంతో రవీందర్‌రెడ్డి తన భార్యను ఇంటికి పంపించేందుకు పాత బస్టాండ్‌లో దింపి, పని నిమిత్తం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ నలుగురు ముఠా సభ్యులు జలజను గమనించి, అత్యంత చాకచక్యంగా ఆమె బ్యాగులోంచి 37 తులాల నగలను చోరీ చేసి ఉడాయించారు. ఇంటికెళ్లిన తర్వాత నగలు పోయినట్టు బాధిత మహిళ గుర్తించింది. భర్త రవీందర్‌రెడ్డితో కలిసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రంగంలోకి దిగారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసును విచారించగా, నాగ్‌పూర్‌కు చెందిన నలుగురు మహిళలు దొంగతనం చేసినట్టు నిర్ధారణ చేసుకున్నారు. ముఠాలోని ఓ సభ్యురాలు హత్గాడే కాంత జగిత్యాలకు వచ్చి ఓ గోల్డ్ షాపులో దోచుకున్న నగలను విక్రయిస్తుండగా, సోమవారం జగిత్యాల టౌన్ పోలీసులు పట్టుకున్నారు. విచారణలో సదరు మహిళ దొంగతనం చేసినట్టు ఒప్పుకొన్నదని, ఆమె వద్ద నుంచి ఏడు తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మిగిలిన ముగ్గురిని సైతం త్వరలోనే పట్టుకుని, మిగతా బంగారు నగలను సైతం స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. మహిళా దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దొంగల ముఠాను కనిపెట్టి మహిళా దొంగను పట్టుకున్న జగిత్యాల సీఐ వేణుగోపాల్, ఎస్ఐ కిరణ్‌ను డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో మరో ఎస్ఐ మన్మదరావు, పీసీలు జీవన్, మల్లేశం, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఒకే అకౌంట్‌పై ముగ్గురు పంతుళ్లకు లోన్లు?

ఆదాయపన్ను ఎగవేతకు ఉపాధ్యాయుల అడ్డదారులు!




- ఎల్ఐసీ నుంచి లోన్ తీసుకోకుండానే ఎత్తినట్టు పత్రాలు
- నెలనెలా ఇంట్రెస్టు చెల్లిస్తున్నట్టు బోగస్ రికార్డులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- ఇదే దారిలో చాలామంది రిటర్న్ దాఖలు
- ఒక్క తిమ్మాపూర్ మండలంలోనే ₹అరకోటికిపైగా టాక్స్ ఎగవేత?
- ఒక్క ఘటనపై జరిగిన విచారణలోనే కళ్లు బైర్లు కమ్మేలా అక్రమాలు

ఓ ఉపాధ్యాయుడు ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నుంచి 2019 మే 27న (లోన్ అకౌంట్ నంబర్ 712600001469) ₹38 లక్షలు రుణం తీసుకున్నట్టు పత్రాలు సమర్పించాడు. ఇంటి నంబర్ 8-2-8-3-81/1/2 భగత్‌నగర్ కరీంనగర్ పేరిట ఈ లోన్ మంజూరైనట్టు ఉన్నది. ఈ ఉపాధ్యాయుడు నెలానెలా ఇంట్రెస్టు కట్టినట్టు చూపి, ఆదాయ పన్ను మినహాయింపు పొందుతున్నాడు.

మరో ఉపాధ్యాయుడు సైతం ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నుంచే 2019 మే 27న (లోన్ అకౌంట్‌నంబర్ 712600001469) ₹38 లక్షలు రుణం తీసుకున్నట్టు చూపాడు. అంతేకాదు, ఈ లోన్ కూడా ఇంటి నంబర్ 8-2-8-3-81/1/2 భగత్‌నగర్ కరీంనగర్ పేరుతోనే ఉండటం గమనార్హం. ఆయన కూడా ఇదే అకౌంట్‌కు నెలానెలా ఇంట్రెస్ట్ పేమెంట్ చేస్తున్నట్టు చూపి, ఆదాయ పన్ను మినహాయింపులు పొందుతున్నాడు.

ఇంకో ఉపాధ్యాయుడు కూడా ఇదే లోన్ అకౌంట్ నంబర్ (712600001469) పై 2018 ఫిబ్రవరి 27న ₹18 లక్షలను తీసుకున్నట్టు చూపడమే కాకుండా, ఇదే అకౌంట్‌కు నెలానెలా ఇంట్రెస్ట్ కడుతున్నట్టు చూపాడు. ఆదాయ పన్ను మినహాయింపులు పొందుతున్నాడు. (పై అకౌంట్ నంబర్ పై రుణం తీసుకున్న ఉపాధ్యాయుల పేర్లు, ఇతర వివరాలు 'నమస్తే తెలంగాణ' వద్ద ఆధారాలతో ఉన్నా.. కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకొని నేరుగా పేర్లు పెట్టడం లేదు)

నిజానికి ఈ అకౌంట్ నంబర్ ఈ ముగ్గురికి మాత్రమే పరిమితం కాలేదని బయటపడుతున్నది. మరో నలుగురు ఉపాధ్యాయులు కూడా ఇదే అకౌంట్‌పై లోన్ తీసుకున్నట్టు చూపి, ఆదాయ పన్ను మినహాయింపులు పొందుతున్నట్టు తెలుస్తున్నది. అందుకోసం ఏకంగా సంతకాలు, స్టేట్‌మెంట్లు, కావాల్సిన పత్రాలను ఫోర్జరీ చేసి పెట్టినట్టు తెలుస్తుండడం చర్చనీయాంశమవుతున్నది.

**సాధారణంగా ఒక అకౌంట్‌పై.. బ్యాంకు లేక ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ అయినా.. మరే ఇతర ఫైనాన్స్ సంస్థ అయినా ఒకరికి మాత్రమే లోన్ ఇస్తాయి. భార్యాభర్తలు ఉంటే జాయింట్ అకౌంట్‌పై మంజూరు చేస్తాయి. కానీ, వేర్వేరు ఉపాధ్యాయులకు ఒకే అకౌంట్‌పై రుణం మంజూరు అవుతుందా? ఒకరికి ₹38లక్షలు, మరొకరికి ₹18 లక్షలు, ఇంకొకరికి ₹38 లక్షల చొప్పన రుణం ఇస్తుందా..? అదే అకౌంట్‌కు నెలానెలా ఇంట్రెస్టు కడుతున్నట్టు లెక్కలు చూపి ఇన్‌కంటాక్సు మినహాయింపులు పొందొచ్చా..? అంటే ఎవరైనా చెప్పే మాట ఎలా సాధ్యమని! కానీ, మన జిల్లాలోని కొంత మంది ఉపాధ్యాయులకు మాత్రం సాధ్యమేనని తెలుస్తున్నది! ఐటీ మినహాయింపు కోసం ఆ టీచర్లు తొక్కిన అడ్డదారులను చూస్తే.. అధికారులకే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఇటీవల ఒక స్కూల్ కాంప్లెక్సులో జరిగిన ఒక సంఘటన ఆధారంగా విచారణకు వెళ్తే ఎన్నో అక్రమాలు బయటపడుతున్నాయి. ఒక్కో విషయాన్ని ఆరా తీస్తున్నప్పుడు ఆదాయపు పన్ను మినహాయింపుల కోసం ఏకంగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరిట ఫేక్ పత్రాలను తయారు చేసి, స్టేట్‌మెంట్లు సృష్టించి, వాటిని సమర్పించి మినహాయింపు పొందడం ఆధారాలతో సహా వెలుగు చూసింది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం చూస్తే.. ఈ తరహా ఒక తిమ్మాపూర్ మండలంలోనే ఏటా ₹అరకోటికిపైగా ఇన్‌కంటాక్స్ ఏగవేస్తున్నట్టు బయటకు వస్తున్నది. అయితే ఇది ఉపాధ్యాయులే చేశారా..? లేక పంతుళ్ల నుంచి డబ్బులు వసూలు చేసి ఇతరులెవరైనా దందా నడుపుతున్నారా..? అన్నది ప్రస్తుతం విద్యాశాఖలో హాట్ టాపిక్‌లా మారింది.**

కరీంనగర్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆదాయ పన్ను మినహాయింపు ఉంటుంది. నిబంధనల ప్రకారం టాక్స్ బెనిఫిట్స్ పొందడానికి ఆస్కారముంటుంది. సేవింగ్స్ కింద గరిష్ఠంగా ₹1.50 లక్షల మినహాయింపు ఉండగా.. ఇంటి అద్దె, మెడికల్ బిల్లులు, అలాగే గృహరుణాల వంటి కింద కూడా పలు రకాల మినహాయింపులు వర్తిస్తాయి. అలాగే నేషనల్ సేవింగ్స్ స్కీమ్స్ కింద గరిష్ఠంగా ₹50వేలు ఉంటుంది. వీటితో పాటు ఇంటి అద్దె (హెచ్‌ఆర్ఏ)కు సంబంధించి మూడు రకాలుగా లెక్కించి, అందులో తక్కువ ఉన్న మొత్తాన్ని పరిగణలోకి తీసుకొని మినహాయింపునిస్తారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశం మేరకే చాలా మంది ఉపాధ్యాయులు తమ రిటర్న్ దాఖలు చేస్తున్నారు. అయితే ఆదాయపన్ను మినహాయింపు ఎక్కువగా జరిగేందుకు కొంతమంది ఆశ చూపినా అడ్డదారులు తొక్కడం లేదు. తప్పు ఏదో రోజు బయట పడుతుందని భావించి కూడా కొంత మంది ఉపాధ్యాయులు.. తప్పుడు దారుల్లో వెళ్లడం లేదు. కానీ, కొంత మంది టీచర్లు చేస్తున్న తప్పుడు పద్ధతులతో మొత్తం ఉపాధ్యాయ లోకమే బద్నాం అవుతుందన్న ఆందోళన విద్యాశాఖ వర్గాల్లో వ్యక్తమవుతున్నది.

### అడ్డదారుల్లో పలువురు పంతుళ్లు

అధికారికంగా చాలా వరకు మినహాయింపులున్నా కొంత మంది పంతుళ్లు మాత్రం అదనంగా పన్ను మినహాయింపు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. అది ఏ స్థాయికి వెళ్లిందంటే.. బ్యాంకు స్టేట్‌మెంట్‌లు, అలాగే ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నుంచి తీసుకున్న రుణాలకు సంబంధించిన పత్రాల నుంచి లోన్ అకౌంట్ నంబర్ క్రియేషన్ వరకు బోగస్ పత్రాలు సృష్టిస్తున్నారు. సదరు తప్పుడు పత్రాలను పెట్టి ఆ లోన్ అకౌంట్‌కు.. అంటే తీసుకున్న రుణానికి ప్రతి నెలా ఇంట్రెస్ట్ కడుతున్నట్టు పత్రాలు కూడా తయారు చేస్తున్నారు. ఆ పత్రాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమర్పిస్తున్నారు. సదరు ఉపాధ్యాయుడి సెల్ఫ్ డిక్లరేషన్ ఉటుండడంతో హెచ్‌ఎంలు సైతం ఆ పత్రాలను యథావిధిగా జిల్లా ట్రెజరీ కార్యాలయాలకు పంపిస్తున్నారు. అక్కడ కూడా పెద్దగా పరిశీలన లేకపోవడంతో ఆవే పత్రాలను యథావిధిగా అప్‌లోడ్ చేస్తున్నారు. ఆ ప్రకారమే ఫాం–16 పొందుతూ.. వ్యక్తిగతంగా తిరిగి రిటర్న్ సమర్పిస్తున్నారు. ఇదంతా ఒక ప్లాన్ ప్రకారం నడుస్తున్నది. నిజానికి ఎక్కడైనా హెచ్‌ఎంలు వాటిని గుర్తించి సదరు టీచర్లను హెచ్చరించే ప్రయత్నం చేసినా.. వెంటనే యూనియన్ నాయకులు రంగంలో దిగుతున్నారు. లేదా బెదిరింపులకు పాల్పడుతున్నారు. 'సెల్ఫ్ డిక్లరేషన్ ఉంది కదా! ఏమైనా ఉంటే మాకే ఇబ్బంది అవుతుంది? మీకేంటి సమస్య' అంటూ ఎదురు తిరుగుతున్నారు. దీంతో ఆ హెచ్‌ఎంలు సైతం 'తమకెందుకెలే' పని కానిచ్చేస్తున్నారు.

### కళ్లు బైర్లు కమ్మే నిజాలు

ఇటీవల తిమ్మాపూర్ మండలంలోని ఒక స్కూల్ కాంప్లెక్స్‌లో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై ప్రస్తుతం విద్యాశాఖ అధికారులు విచారణ సాగిస్తున్నారు. ఆ కోణంలో దర్యాప్తు చేస్తుండగా అనేక అక్రమాలు బయట పడుతున్నాయి. నిజానికి సదరు నిధుల గోల్‌మాల్‌కు పన్ను ఎగవేతకు సంబంధం లేదు. కానీ, కొంత మంది ఉపాధ్యాయులకు సంబంధించిన టాక్స్ వివరాలు ఆరా తీసినప్పుడు కళ్లు బైర్లు కమ్మే నిజాలు బహిర్గతమవుతున్నాయి. ఒక తిమ్మాపూర్ మండలంలోనే నిబంధనలకు విరుద్ధంగా లేని రుణాలు తీసుకున్నట్టు పత్రాలు సృష్టించడం.. ఇదే కోణంలో ఫోర్జరీలు చేసి ఫేక్ పత్రాలు తయారు చేయడం.. వాటి ఆధారంగా పన్ను మినహాయింపులు పొందడం షరా మామూలే అన్నట్టుగా మారింది. ఈ ఒక్క మండంలోనే ఏటా ₹అరకోటికిపైగా టాక్స్ ఏగవేసినట్టు వెలుగులోకి వస్తున్నది. నిజానికి నిబంధనల ప్రకారం కూడా చాలా మినహాయింపులున్నాయి. అయితే పెరిగిన వేతనాల నేపథ్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆదాయ పన్ను పడుతున్నది. దీనిని తప్పించుకోవడానికి కొందరు అడ్డదారులను వెతుక్కుంటున్నారు. అయితే ఈ తప్పులో చివరికి వారే ఇరుక్కోక తప్పదన్న విషయాన్ని గుర్తిస్తున్నారా.. లేదా.. ? అన్నది ముమ్ముందు తేలుతుంది. ఈ అక్రమాలు అధికారుల దృష్టికి వచ్చినా వాటిని బహిర్గతం చేసేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తున్నది. తీగలాగితే డొంకంతా కదులుతుందని, తద్వారా విద్యావ్యవస్థ మొత్తానికి చెడ్డపేరు వస్తుందని ఆలోచిస్తున్నట్టు ఒక అధికారి ద్వారా అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది.

### ఈ దందాకు సూత్రధారులెవరు?

నిజానికి పన్ను మినహాయింపు కోసం ఉపాధ్యాయులే తప్పుడు పత్రాలు సృష్టిస్తున్నారా..? లేక ఎవరైనా బయటి వ్యక్తులు ఈ దందాను నడుపుతున్నారా..? అన్నది తేలాల్సిన అవసరమున్నది. బయట పడుతున్న పత్రాలను చూస్తే ఒకే ఇంటి నంబర్‌పై ఒకే రోజు రుణాలు తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. నిశితంగా పరిశీలిస్తే.. ఒకే అకౌంట్‌పై ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించడంలో ఒకరే కీలకంగా వ్యవరిస్తున్నారా..? లేదా సదరు సూత్రదారుడు ఉపాధ్యాయుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ దందాను నడుపుతున్నాడా..? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. పన్ను మిహాయింపు కోసం కొంత మంది టీచర్లు ఎంతకైనా తెగిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో 'పై ఒక అకౌంట్'పై విచారణ జరిపితే వాస్తవాలు బహిర్గతమయ్యే అవకాశాలున్నాయి. దీని వెనకున్న సూత్రదారులు.. పాత్రదారులెవరో బయట పడుతుంది. తద్వారా సర్కారు ఆదాయానికి గండిపడకుండా ఉండడమే కాదు, ప్రధానంగా అడ్డదారులకు బ్రేక్ పడుతుంది. అలాగే ఉపాధ్యాయులు ఇటువంటి తప్పిదాల్లో ఇరుక్కోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు అవుతుంది. ఈ వ్యవహారంపై విద్యాశాఖ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉండగా.. పై మూడు అకౌంట్లలో ఎవరు ఒరిజనలో.. ఎవరు నకిలీనో తేల్చితే మరిన్ని అక్రమాలు బహిర్గతమయ్యే అవకాశమున్నది.

## పండుగ కానుకలూ పాయె!








- మొన్న రంజాన్ తోఫా, నిన్న బతుకమ్మ చీరె
- నేడు క్రిస్మస్ గిఫ్టులకు ప్రభుత్వం మంగళం
- కేసీఆర్ పాలనలో సంతోషంగా పండుగల నిర్వహణ
- కులమతాలకతీతంగా కానుకలు
- పేదలను పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు
- రేవంత్‌పై మండిపడుతున్న ప్రజానీకం

నాడు కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల పండుగలకు పెద్దపీట వేసి కానుకలు నేడు కాంగ్రెస్ సర్కారు ఆ సంప్రదాయానికి మంగళం పాడింది. ఇప్పటికే ముస్లింలకు రంజాన్ తోఫా, ఆడబిడ్డలకు బతుకమ్మ చీర ఇవ్వకుండా చేతులెత్తేసింది. తాజాగా క్రిస్టియన్లకు క్రిస్మస్ గిఫ్టును కూడా ఎత్తేయగా, ఆయా వర్గాల్లో అసహనం వ్యక్తమవుతున్నది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాలకు అందించిన ప్రోత్సాహంతో ప్రజలు సంతోషంగా పండుగలు జరుపుకొన్నారని గుర్తు చేస్తున్నారు. కానీ, రేవంత్ పాలనలో నిరాశే మిగులుతున్నదని వాపోతున్నారు.

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 23 : పేదల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సర్కారు అనేక పథకాలను తెచ్చి, దశాబ్దకాలంపాటు విజయవంతంగా అమలు చేసింది. స్వరాష్ట్రంలోనైనా అన్ని వర్గాల ప్రజలు తమ పండుగలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొనేలా పండుగల నిర్వహణతోపాటు, ఆయా మతాల వారికి నూతన దుస్తులు అందించింది. హిందూ మహిళలకు బతుకమ్మ చీరెలు, ముస్లింలకు ఇఫ్తార్ విందుతోపాటు లాల్చి పైజామా, చీర, చుడీదార్ బట్ట, క్రిస్టియన్లకు చీర, చుడీదార్, ప్యాంటు, షర్టు బట్టలతో కిట్లను 15 రోజుల మందే అందించేది. మసీదుల్లో ఇఫ్తార్ విందులు, చర్చిల్లో క్రిస్మస్ సందర్భంగా సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసింది. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే సుమారు 3.40 లక్షల మంది మహిళలకు బతుకమ్మ చీరెలు ఏటా పంపిణీ చేయగా, 7,500 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా, 4 వేల క్రైస్తవ కుటుంబాలకు క్రిస్మస్ గిఫ్టులు అందించింది. ఇలానే మిగతా జిల్లాలకు కూడా పెద్ద ఎత్తున పంపిణీ చేసింది. దీంతో, సంతోషంగా ఆయా మతాల కుటుంబాలు పండుగలు జరుపుకునేవి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం పండుగలకు దుస్తులు పంపిణీ చేసే కార్యక్రమానికి చెల్లుచీటి పలికింది. మొన్న రంజాన్, నిన్న బతుకమ్మ, నేడు క్రిస్మస్ పండుగలకు పేద, మధ్య తరగతి కుటుంబాలకు మొండిచేయి చూపింది. దీంతో, ఆయా వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. పండుగ వేళలో తాము వేలకు వేలు ఖర్చు చేయలేని స్థితిలో ఉంటే, ఉచితంగా కొత్త దుస్తులు అందించి అప్పటి సీఎం కేసీఆర్ పెద్దన్నలా వ్యవహరించారని, కానీ, నేటి ముఖ్యమంత్రి రేవంత్ పండుగలొస్తే తమను ఆమడదూరం పెడుతున్నారని ఆయా మతాల పేదలు విమర్శిస్తున్నారు. పండుగ దుస్తుల పంపిణీ నిలిపేసిన విషయం తెలియని పేద క్రిస్టియన్లు ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా తమకు కొత్త దుస్తులు అందుతాయనే ఆశతో ఎదురుచూస్తున్నారు. కేవలం క్రిస్మస్ విందులతోనే సరిపెడుతున్నట్టు తెలుస్తుండగా, గిఫ్టులు ఏవని ప్రశ్నిస్తున్నారు. క్రిస్మస్ రేపే ఉన్నా ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

## ముంపు నిర్వాసితులందరికీ ఇండ్లు ఇవ్వాలి

- 10,683 మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలి
- ఎన్నికల హామీని రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలి
- మేడిగడ్డకు మరమ్మతు పనులు చేపట్టాలి
- ఆరు గ్యారెంటీలపై ఇంటింటికీ త్వరలో బీఆర్ఎస్
- అక్రమ అరెస్టులపై న్యాయ పోరాటం చేస్తాం
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పక్కన మాజీ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల టౌన్ : ముంపు నిర్వాసితులందరికీ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని వర్తింపజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా 10,683 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. నాడు జిల్లా మంత్రిగా ఉన్న కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబుతోపాటు ఎంపీగా పనిచేసిన తాను సైతం డబుల్ బెడ్రూం ఇండ్లు అందించేందుకు అనేక ప్రయత్నాలు చేశామన్నారు. చట్ట ప్రకారమైన సమస్యల కారణంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేయలేకపోయారని గుర్తుచేశారు. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ నిర్వాసితులందరికీ డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వలేదని.. తాము అధికారంలోకి వస్తే అందరికీ ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రచారం చేశారని గుర్తుచేశారు. కానీ, 10,683 మంది లబ్ధిదారులకు 4,696 మందికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని జీవో తెచ్చారన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నేతలు లబ్ధిదారులందరికీ పరిహారం ఇస్తే తాము స్వాగతిస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ సేకరణ చేసిన సందర్భంలో పరిహారం అందించిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం పరిహారం చెల్లించిందని గుర్తు చేశారు. డబుల్ బెడ్రూం ఇంటి నిర్మాణం కోసం ₹5 లక్షలు ఇస్తానని కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో చట్ట పరమైన సమస్యలతో చేయలేకపోయారని గుర్తు చేశారు. ఏడాది ప్రభుత్వంలో ఆది శ్రీనివాస్, పొన్నం ప్రభాకర్‌పై ఘాటు విమర్శలు తాను చేయదలచుకోలేదని, చెప్పిన మాట ప్రకారం నిర్వాసితులందరికీ పరిహారంపై జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సంవత్సర కాలంలో ఒక్క గ్యారెంటీ అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని దుయ్యబట్టారు. గ్యాస్ సబ్సిడీ డబ్బులు పడుతలేవని మహిళలు బాధపడుతున్నారన్నారు. వచ్చే ఏడాది ఆరు గ్యారెంటీల పత్రాలు పట్టుకుని ఇంటింటికీ వెళ్తామని, హామీల అమలుపై ప్రజల్ని అడిగి తెలుసుకుంటామన్నారు. అబద్ధపు ప్రచారంతో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించారన్నారు. ఎస్సారెస్పీ వరద నీరు, శ్రీపాద ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ద్వారా సిరిసిల్ల మానేరు నిండుకుండలా మారిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ మంత్రులకు కనీస అవగాహన లేదని విమర్శించారు. కోనరావుపేట మండలంలోని మల్కపేట రిజర్వాయర్, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు 50 టీఎంసీలకు పెంచింది కేసీఆర్ ప్రభుత్వం అని గుర్తుంచుకోవాలన్నారు. మూసీ ప్రాజెక్టు ప్రక్షాళనకు వినియోగిస్తానని రేవంత్‌రెడ్డి చెప్పిన మల్లన్నసాగర్ నీళ్లు కాళేశ్వరం ప్రాజెక్టులోనివేనని చెప్పారు. మేడిగడ్డ ప్రాజెక్టును మరమ్మతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల భూప్రకంపనలు వచ్చినా మేడిగడ్డకు ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టుకు ఏదైనా జరిగితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. యాసంగి పంటకు నీరు అందించడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి చెబుతున్నారని, వెంటనే మేడిగడ్డకు మరమ్మతులు చేపట్టి నీరు అందించాలని డిమాండ్ చేశారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గ్రామాల్లోని చెరువులన్నింటనీ సస్యశ్యామలం చేసింది కేసీఆర్ అని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల అరెస్టులు కక్షసాధింపు చర్యల్లో భాగంగానేనని తాము భావిస్తున్నామని, వీటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అభివృద్ధి చెందుతున్న క్రమంలో జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం గుదిబండగా మారిందన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు గుండ్లపల్లి పూర్ణచందర్, బొల్లి రామ్మోహన్, మాట్ల మధు, న్యాలకొండ రాఘవరెడ్డి, పడిగెల మానస, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, పడిగెల రాజు, బండారి శ్యాం, బుర్ర మల్లిఖార్జున్, వెంగళ శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, గుగులోతు సురేష్‌నాయక్, సిలువేరి చిరంజీవి, వీరబత్తిని కమలాకర్, సబ్బని హరీశ్ పాల్గొన్నారు.